కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి

జఫర్‌గడ్, జనవరి 19 : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పలువురు సర్పంచులు కోరారు. ఈ మేరకు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యను కలిసి వినతి పత్రం అందించారు. సర్పంచుల పదవీ కాలం ఈ నెలతో ముగియనుండడంతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను చెల్లించాలని వారు కోరారు. సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలని, ఇన్‌చార్జీల పాలన వద్దని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కలెక్టర్, డీపీవో, ఎంపీడీవో, ఎంపీవోలకు వినతిపత్రాలను అందించినట్లు తెలిపారు. సర్పంచులు ప్రవీణ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, పార్వతి, తులసమ్మ, మల్లేశం, జయపాల్‌రెడ్డి, రాజేశ్వరి, పొన్నాల జ్యోతి పాల్గొన్నారు.

నేటి నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్

ప్రవీణ్‌కుమార్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 19 : శనివారం నిర్వహిస్తున్న నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రవేశ పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ కే ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. వరంగల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికిగాను శివునిపల్లి బాలుర హైస్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 197మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని, ఒక్కో తరగతి గదిలో 24మంది చొప్పున పరీక్ష రాసేలా తొమ్మిది తరగతి గదులను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు 11గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకుని ఓఎంఆర్ షీట్ నింపాలని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్లలో ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేశామన్నారు.

కబడ్డీ పోటీల్లో చెన్నూరు విద్యార్థిని ప్రతిభ

మొలుగూరి అఖిల

పాలకుర్తి, జనవరి19 : జిల్లా కేంద్రంలో ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు 67వ అంతర్ పాఠశాలల అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. వీటిలో మండలంలోని చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని మొలుగూరి అఖిల ఉమ్మడి వరంగల్ జట్టులో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ పుస్కూరి పార్వతి, ఎంపీటీసీ పుస్కూరి కళింగరావు, పాఠవాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్యామ్‌సుందర్‌రావు విజేత అఖిలను అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి : సీఐ విశ్వేశ్వర్

పాలకుర్తి, జనవరి 19 : ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ అన్నారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర పోలీసు బలగాలతో ర్యాలీ నిర్వహించారు. పుణ్యక్షేత్రమైన సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి గుడివాడ చౌరస్తా మీదుగా రాజీవ్ చౌరస్తా వరకు పోలీసు బలగాలతో కవాతు కొనసాగించారు. అనంతరం సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకారం అందించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి'

బచ్చన్నపేట, జనవరి 19 : గ్రామంలో అభివృద్ధి పనులతోపాటు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉపసర్పంచ్ సిద్ధారెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నరామన్‌చర్లలో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. సిద్ధారెడ్డి మాట్లాడుతూ జడ్పీ నుంచి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, నాయకులు గిరబోయిన అంజయ్య, ఎండీ ఆజాం, వెంకటేశ్, సిద్ధులు, పంచాయతీ కార్యదర్శి భానుచందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TO-LET

★HNK బాలసముద్రం LIC డివిజన్ ఆఫీస్ ప్రక్కన 1st ఫ్లోర్ 2000 Sft. ఆఫీసెస్, కమర్షియల్, BIG Family కి కిరాయికి ఇవ్వబడును. సంప్ర: సెల్: 9908117447
NTW-323115

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్; డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సిటీస్కాన్‌ను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- విధి నిర్వహణలో డాక్టర్లు అలసత్వం చేయొద్దు
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా

జనగామ, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని, సేవల్లో అలసత్వంగా ఉండొద్దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. వార్డుల్లోని అన్ని విభాగాలను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులను ఆత్మీయంగా పలకరించారు. దవాఖానలో అందుతున్న వైద్యం, డాక్టర్లు, సిబ్బంది సేవలు, మందులు, చికిత్స, వైద్య పరీక్షలు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆరేళ్లుగా సిటీ స్కాన్ పనిచేయడం లేదని తెలుసుకుని 'ఎందుకు పనిచేయడం లేదు.. ఎప్పటి నుంచి పని చేయడం లేదు..' అనే కారణాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధతో మాట్లాడారు. పాయిజన్ విభాగం, మైనర్ ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ విభాగం జనరల్ సర్జికల్, ఓపీ, ఎన్‌సీడీ క్లినిక్, మానసిక వైద్య ఓపీ గది, ఛాతీ వైద్యుడి ఓపీ, పిజియోథెరిపి గది విభాగాలను ఆయన పరిశీలించారు. అప్పటికప్పుడే ఆయా విభాగాల్లోని సమస్యలు, పరిష్కారంపై అధికారులతో చర్చించారు.

అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు అందుతున్నాయా లేదా?.. పరికరాలు పనిచేస్తున్నాయా లేదా..? వైద్య పరీక్షలు సరిగ్గా చేస్తున్నారా లేదా? అనే అంశాలపై అన్ని విభాగాలను అధికారులు, సిబ్బందితో పరిశీలించామన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. జిల్లా ప్రధాన వైద్యశాలతోపాటు చంపక్‌హిల్స్‌లోని ఎంసీహెచ్ హాస్పిటల్‌లో వైద్య చికిత్స, రవాణా సౌకర్యం సరిగ్గా లేవని తన దృష్టికి వచ్చిందన్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా డాక్టర్లు పనిచేయాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలపై పెద్ద ఎత్తున ప్రచారం జరగాలని, అప్పుడే రోగులు దవాఖానకు వచ్చి వైద్య సేవలు పొందుతారని పల్లా అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ నాయకులు బండ యాదగిరిరెడ్డి, రావెల రవి, ఉడుగుల నర్సింగరావు, ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు.

'బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి'

పాలకుర్తి, జనవరి19: కేంద్రంలోని మతతత్వ బీజేపీ పాలనను అంతమొందించేందుకు ప్రజాస్వామ్యవాదులు కలిసికట్టుగా ముందుకు రావాలని మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(రెడ్‌ఫ్లాగ్) రాష్ట్ర నాయకుడు దొంతి రాజేశ్‌కన్నా పిలుపునిచ్చారు. పార్టీ 3వ రాష్ట్ర మహాసభలు వచ్చే నెల 10,11 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మహాసభల కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. రాజేశ్‌కన్నా మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పుదమల్ల భాస్కర్, మాన్యపు భుజేందర్, ఎండీ కాసీం, సారయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ చౌరస్తా, జనవరి 19 : జనగామ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎన్పీడీసీఎల్ డీఈ రవిశంకర్ శుక్రవారం తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఈ ఆటంకం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ మహేంద్ర

జనగామ చౌరస్తా, జనవరి 19 : ఆదాయ పన్ను చెల్లింపుపై ఆ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు (డీడీవో)నిర్వహించిన అవగాహన సదస్సు ముగిసింది. ఈ-టీడీఎస్ ఫైలింగ్, ట్యాక్స్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సుహాసిని, ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ టీ మహేంద్ర మాట్లాడారు. ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి మాధవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా త్రైమాసిక, వార్షిక రిటర్న్స్ దాఖలుపై అవగాహన కల్పించారు. టీడీఎస్ క్వార్టర్లీ స్టేట్మెంట్స్ సమయానికి ఫైల్ చేయాలని సూచించారు. లేదంటే రూ.2వేలు పెనాల్టీ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీవో నర్సింహారెడ్డి, ఏటీవో రాజేంద్రకుమార్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ గీత, ఎస్టీవో శ్రీనివాస్, వీరేందర్, డీడీవోలు, ట్రెజరీ, ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

జనగామ చౌరస్తా, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జనగామలోని డీసీసీ కార్యాలయంలో బడికె ఇందిర ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొమ్మూరి, విశిష్ట అతిథిగా మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలం పద్మ హాజరయ్యారు. ఈ సం దర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ రాజకీయాల్లో మహిళలు మరింతగా రాణించాలన్నారు. త్వరలో గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగాల కల్యాణి, సుంకరి నిర్మల, జక్కుల అనిత, వడ్లకొండ తార, కాముని జయలక్ష్మి, పేర్ని ఉష, బుర్రెడ్డి శ్రీలతరెడ్డి, బాగాల మాలతీరెడ్డి, బండిపెల్లి మణెమ్మ, చింత జ్యోత్స్న, తిరువాయిపాలెం అండాలు, గాడిపెల్లి సక్కుబాయి, చెన్నూరి విజయలక్ష్మి, ఎండీ మున్ని బేగం, ప్రమీల, కూకట్ల సుజాత పాల్గొన్నారు.

ఆపరేషన్ జరిగిన మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీదేవి

డీపీఎల్ క్యాంపును వినియోగించుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి శ్రీదేవి

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 19 : కుటుంబ నియంత్రణ కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పక్షం రోజులకోసారి నిర్వహించే డీపీఎల్ క్యాంపును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి కోరారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం, తాటికొండ, చిల్పూరు మండలం మల్కాపూర్ ప్రభుత్వాసుపత్రుల పరిధిలోని వారికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపు నిర్వహించారు. 24మంది మహిళలకు డాక్టర్ గోపాల్‌రావు డీపీఎల్ ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. శిబిరాన్ని డాక్టర్ శ్రీదేవి సందర్శించి, ఆపరేషన్ చేయించుకున్న మహిళలతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జనార్దన్, డాక్టర్లు సంధ్యారాణి, సుమన్, మానస, సంధ్య, రజిని, శంకర్, వీరాంజనేయులు, సీహెచ్‌వో సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కొన్నెలో ఉత్సవాలకు ముస్తాబైన దుర్గామాత ఆలయం

నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

బచ్చన్నపేట, జనవరి 19 : మండలంలోని కొన్నె గ్రామంలో నేడు, రేపు దుర్గామాత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు గ్రామ దేవతలకు పూజలు చేసిన అనంతరం మొక్కులు చెల్లించుకోవాలన్నారు. శనివారం బోనాలు సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వెంకట్‌గౌడ్ వివరించారు. ఆదివారం ప్రజలంతా వనభోజనాలకు వెళ్తారని తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు, అన్ని కులాల పెద్దల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుపుతున్నామని వెల్లడించారు.

ట్రెసా డైరీని ఆవిష్కరిస్తున్న శివలింగయ్య

'ట్రెసా' డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ చౌరస్తా, జనవరి 19 : 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (ట్రెసా) 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ శివలింగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి శ్రీనివాస్, మన్సూరీ, అనిల్ బాబు, అన్వేష్, బలరాం, షకీర్, క్రాంతి, విజయ్‌కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బల్మూరి వెంకట్‌కు పలువురి శుభాకాంక్షలు

బచ్చన్నపేట, జనవరి 19 : ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ స్థానం కోసం నామినేషన్ వేసిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు అందె సంజయ్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవం కానున్నారని ఆయన వివరించి హర్షం వ్యక్తం చేశారు.

జాతర టెండర్ల ఆదాయం రూ.6.76 లక్షలు

జాతర ప్రదేశంలో చదును చేసే పనులను ప్రారంభిస్తున్న కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి

చిల్పూరు, జనవరి 19 : మండలంలోని శ్రీపతిపల్లి- కొండాపూర్ మధ్య వచ్చే నెల 21నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరలో వివిధ దుకాణాలకు శుక్రవారం టెండర్లు నిర్వహించారు. వీటికి రూ.6.76లక్షల ఆదాయం సమకూరిందని జాతర చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తెలిపారు. మద్యం విక్రయాల టెండర్‌కు రూ.4.20లక్షలు, కోళ్లు రూ.1.31లక్షలు, బెల్లం రూ.81 వేలు, కొబ్బరికాయలు రూ.44వేలు ఆదాయం వచ్చిందని మనోజ్‌రెడ్డి తెలిపారు. రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతరకు అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యంతోపాటు జాతర ప్రదేశాన్ని చదును చేసే పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. జాతరకు రెండు గ్రామాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండాపూర్ సర్పంచ్ లోడెం రజితారవీందర్, మాజీ సర్పంచులు వెలిశాల కనకయ్య, మారబోయిన ఎల్లయ్య, రంగు రమేశ్, రంగు హరీశ్, గుర్రపు వెంకటేశ్వర్లు, నర్సయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గాలి ప్రవీణ్, గుల్ల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'నైతిక విలువలు పెంపొందించాలి'

విద్యార్థినులు, ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్ కృష్ణవేణి

బచ్చన్నపేట, జనవరి 19 : సమాజ సేవలో భాగస్వాములు కావడంతోపాటు నైతిక విలువలు పెంపొందించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి అన్నారు. ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాలను శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. వేమన ఫౌండేషన్ తరుపున అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో వేమన పద్య పఠన పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి మాట్లాడుతూ వేమన పద్యాలు పరిశీలిస్తే తెలుగు భాషపై అభిరుచి, అందులోని గొప్పతనం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు స్వర్గం నర్సింహులు, మీసాల సుధాకర్, పర్విన్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెంబర్తిలో ఎమ్మెల్యే పల్లా సొంత ఖర్చులతో నిర్మించిన బస్టాప్

ఎమ్మెల్యే 'పల్లా' సొంత ఖర్చులతో బస్టాప్ నిర్మాణం

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చిన రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, జనవరి 19 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పెంబర్తి గ్రామస్తులకు బస్టాప్‌ను తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ మండలం పెంబర్తిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానికులు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన రాజేశ్వర్‌రెడ్డి తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే బస్టాప్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు బస్టాప్ నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పల్లా తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మోకుదెబ్బ నాయకులు

పాలకుర్తి, జనవరి 19 : గౌడ జనహక్కుల పోరాట సమితి(మోకుదెబ్బ) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మొలుగూరు యాకన్న మాట్లాడుతూ తాడి చెట్టుపై నుంచి పడి చనిపోతున్న గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సమితి జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ, నాయకులు ఉపేందర్, సలేంద్ర, శ్రీనివాస్, సోమన్న పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లోని ఆక్రమిత ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకుడు రమేశ్

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి : సీపీఐ

జఫర్‌గఢ్, జనవరి 19 : మండలంలోని ఆయా గ్రామాల్లో అన్యాక్రాంతమైన భూములతో పాటు ఇతర ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని శుక్రవారం ఆయన గుర్తించారు. రమేశ్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండలతో కొంత మంది నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని రమేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- జిల్లా కలెక్టర్ శివలింగయ్యతో వీడియోకాన్ఫరెన్స్

జనగామ చౌరస్తా, జనవరి 19 : ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, సుహాసినితో నూతన ఓటరు జాబితా రూపకల్పనపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వికాస్‌రాజ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఓటరు నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అవసరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి మౌలిక వసతులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

కల్పించాలన్నారు. ఈ నెల 22న ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి వచ్చేనెల 6వ తేదీలోగా ముగించాలన్నారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు నమూనా జాబితా పూర్తి చేసి, మార్చి 29న తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా ప్రకటించాలని వికాస్‌రాజ్ పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

నూతన ఓటరు జాబితా రూపకల్పన కోసం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆర్డీవోలను ఆదే